క్లుప్తంగా

13 నుంచి వన్నూర్‌వలి ఉరుసు



ఉరుసుకు ముస్తాబైన దర్గా

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో వన్నూర్‌వలిస్వామి ఉరుసును ఈనెల 13వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యుడు ముల్లా వన్నూర్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా విశేష పూజలు, గంధోత్సవం జరుగుతాయని చెప్పారు. మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన వన్నూర్‌వలిస్వామి ఉరుసును భక్తులు విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు దర్గాను రంగులు వేసి ముస్తాబు చేశారు.

బీజేపీ నాయకుల సంబరాలు



కోవెలకుంట్ల: బాణసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు



డోన్‌లో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

కోవెలకుంట్ల: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో శనివారం కోవెలకుంట్ల పట్టణంలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న, మండల అధ్యక్షుడు లోకేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సర్కిల్‌లో బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, దేశాభివృద్ధికి తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలు ఆయా రాష్ట్రాల్లో పార్టీని విజయపథంలో నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతయ్య, సీతారామయ్య, రాజు, మల్లికార్జున, తేజసుబ్బయ్య, ఉసేన్‌వలి, సుబ్బరాయుడు, రాజశేఖర్‌శర్మ, నరసింహ శర్మ పాల్గొన్నారు.

డోన్ టౌన్: డోన్ పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఢిల్లీలో ఆ పార్టీ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సందు వెంకటరమణ, నాయకులు నటరాజ్, కిరణ్, సుధాకర్, రవికుమార్, సురేష్‌కుమార్, సుబ్రమణ్యం, నాగరాజు, రవి ప్రకాష్, విజయ్ భాస్కర్, ఉమ్మాజీరావు, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యాక్షుడు కొత్తకాపు హేమ సుందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సీసం గుంతల విజయ్, వడ్డే మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పాత బస్టాండ్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, యువమోర్చ అధ్యక్షుడు ధర్మారెడ్డి, నాయకులు నాగ మోహన్, నారాయణ, విశ్వనాథ్‌రెడ్డి, రవి శంకర్, భాస్కర్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి కేక్ కట్ చేశారు.

నేడు బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

డోన్ టౌన్: పట్టణంలోని రోటరీ క్లబ్ భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బీజేపీ డోన్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సందు వెంకటరమణ తెలిపారు. ముందుగా పాతబస్టాండ్ వద్ద నున్న సమైఖ్యాంధ్ర కట్ట వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ ఉంటుందని చెప్పారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

తూడిచెర్ల సబ్‌చానల్‌కు 300 క్యూసెక్కుల నీరు



కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

పాములపాడు: మండలంలోని కేసీ కెనాల్ 120వ కిలోమీటర్ లాకిన్స్‌లా నుంచి శనివారం 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుంకేశుల నుంచి 1,500 క్యూసెక్కుల నీరు కేసీ కెనాల్‌లోకి వస్తుందన్నారు. లాకిన్స్‌లా నుంచి అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, నిప్పుల వాగుకు నిలుపుదల చేశామని వివరించారు.

ఆశల సాగు



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



పొలంలో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు



నారుమడి

ఎన్నో ఆశలతో వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో అవుకు రిజర్వాయర్‌లో నీరు సమృద్ధిగా ఉండడంతో అవుకు మండలంలో 4781 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. కోత దశలో అకాల వర్షాలు కురవడంతో దిగుబడి తగ్గింది. గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం అవుకు రిజార్వయర్‌లో 2.608 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్‌కు ఎస్సార్బీసీ కాల్వ ద్వారా 260 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంది. రిజర్వాయర్, ఎస్సార్బీసీ ఆయకట్టు కింద రైతులు పంట సాగుకు 322 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రబీ సీజన్‌లోనైనా పంటలు బాగా పండి మంచి దిగుబడి రావాలని రైతులు ఆశగా సాగు పనులు మొదలుపెట్టారు.

– అవుకు

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



బేతంచెర్ల: భీష్మాచార్యుని చిత్రపటానికి పూజలు చేస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు

బేతంచెర్ల: మండలంలోని పలు గ్రామాల్లో భీష్మ ఏకాదశి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని తెలుగు రంగయ్య స్వగృహంలో గంగపుత్రుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తెలుగు వెంకటరమణ, ఎల్లయ్య భీష్మాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. సమరసతసేవా ఫౌండేషన్ నంద్యాల డివిజన్ కన్వీనర్ నాగమోహన్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. మహాభారతంలో భీష్మాచార్యుని పాత్ర ఎంతో కీలకమన్నారు. తండ్రి, కుటుంబం కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప యోధుడు అని కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు గంగన్న, మద్దిలేటి, రాముడు, మద్దయ్య, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, శ్రీను, పరమేష్ పాల్గొన్నారు.

డోన్: మహా భారతంలో భీష్ముని పాత్ర సమోన్నతమైందని గంగపుత్రల సంఘం గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. స్థానిక కోట్లవారిపల్లె సమీపంలో నిర్మిస్తున్న గంగమ్మ ఆలయం వద్ద సంఘం అధ్యక్షుడు కొచ్చెర్వు గోవిందు ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ.. కురుక్షేత్ర మహా సంగ్రామంలో ధర్మరాజుకు విష్ణు సహస్త్రనామాన్ని బోధించిన అనంతరమే విష్ణుసాయుజ్యాన్ని భీష్ముడు పొందగలిగాడన్నారు. పరమ పవిత్రంగా భావించే భీష్మ ఏకాదశి రోజు ఆ మహాత్ముని స్మరించుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. సంఘం నాయకులు వెంకట్రాముడు, చంద్రుడు, సాంబశివుడు, శివయ్య, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.



భీష్మునికి నివాళులర్పిస్తున్న గంగపుత్రులు



కోవెలకుంట్ల పంచాయతీ సర్కిల్‌లో నడిరోడ్డుపై ఆవుల మంద

రోడ్లపై పశువులు.. వాహనదారుల ఇక్కట్లు

కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని ప్రధాన రోడ్లపై నిత్యం ఆవులు సంచరిస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, గ్రామ పంచాయతీ సర్కిల్, ముదిగేడు చౌరస్తా, తదితర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో సైతం ఆవులు నడిరోడ్లపైనే తిరుగుతున్నాయి. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర పట్టణాలవైపు రోజు వందలాది బైక్‌లు, కార్లు, తదితర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి సమయాల్లో మందలు మందలుగా ఆవులు నడిరోడ్లపైనే ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆవులను గోశాలలకు తరలించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–కోవెలకుంట్ల

పార్టీ బలోపేతానికి కృషి



వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోపాజీ సత్యంను సన్మానిస్తున్న నాయకులు

అవుకు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ బనగానపల్లె నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోపాజీ సత్యం అన్నారు. ఇటీవల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఆయన్ను మాలమహానాడు నేతలు, ప్రజా సంఘాల నాయకులు సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనపై ఉన్న నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను సమర్థవంతగా నిర్వహిస్తానని తెలిపారు. వైఎస్‌ఆర్‌సీపీ హయాంలోనే ఎస్సీలకు న్యాయం జరిగిందని తెలిపారు. నాయకులు జీనుగు క్రిష్ణ, బాలన్న, బక్కయ్య, నారాయణ, నాగాంజనేయులు, వెంకటేశ్వర్లు, భూపాలు, కంబగిరి, శివరాముడు, మల్లి, సుబ్బయ్య, శేఖర్, నమ్మియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

మహానంది: మహానందిలో 24 నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి తెలిపారు. అలంకార మండపంలో శనివారం బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పెళ్లిపెద్ద నంద్యాల బ్రహ్మనందీశ్వరస్వామి వార్లను ఆహ్వానించేందుకు 22న మహానందీశ్వరుడి దంపతులు వెళ్లి, 23న తిరిగి వస్తారన్నారు. 24 నుంచి పూజలు ప్రారంభమవుతాయని, సాయంత్రం ధ్వజారోహణం పూజలు శాస్త్రోక్తంగా చేపడతారని తెలిపారు. ప్రతి రోజూ స్వామి, అమ్మవార్లకు ఉదయం, రాత్రి వాహనసేవలు, గ్రామోత్సవాలు ఉంటాయన్నారు. 26న మహాలింగోద్భవం సందర్భంగా (మహా శివరాత్రి) మహారుద్రాభిషేకం, మరుసటి రోజు(27న) తెల్లవారుజామున మహానందీశ్వర కల్యాణం, రాత్రి పుష్పపల్లకీ సేవ, 28న మహారథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఈజీ, ఏఈఓ, పండితులు

అంతర్రాష్ట్ర కబడ్డీ విజేతగా ప్యాపిలి జట్టు



ప్యాపిలి-ఏ జట్టుకు షీల్డ్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

హొళగుంద: సిద్దేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీల్లో ప్యాపిలి-ఏ జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం మొదలైన పోటీల్లో శనివారం ఫైనల్ పోటీలు జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ప్యాపిలి-ఏ, ప్యాపిలి-బి జట్లు హోరాహోరీగా తలపడగ ప్యాపిలి-ఏ జట్టు గెలుపొందింది. గ్రామస్తులు వీరనగౌడ్, తిక్కస్వామి, హెచ్‌జే పవన్ రూ.30 వేలు నగదు, షీల్డ్‌ను విజేత జట్టుకు అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన ప్యాపిలి-బి జట్టుకు బాగోడి రాముడు, పెద్యాట మల్లయ్య సహకారంతో రూ.20 వేలు, మూడవ బహుమతిగాఆదోని జట్టుకు రూ.10 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన హొళగుంద జట్టుకు రూ.5 వేలను అందజేసినట్లు నిర్వాహకులు తిక్కస్వామి, పవనచారి, అశోక్, దేవరాజ్, మల్లికార్జున తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం



ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని పలక చింతమాను ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. ఉదయం వేదపండితులు ప్రాతఃకాల పూజ, అగ్నిప్రతిష్ట, గణపతి హోమం, వాస్తుహోమంతో పాటు సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ మూలమంత్ర హోమాల అనంతరం మేష లగ్నంలో యంత్ర ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నేటి నుంచి షిర్డీసాయి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



డోన్‌లో నిర్మించిన షిర్డీసాయిబాబా ఆలయం



బాబా విగ్రహం

డోన్: పట్టణ శివారు కర్నూలు మార్గంలో రూ.10 కోట్లతో ఆకర్షణీయంగా నిర్మించిన షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. సుమారు 15 ఏళ్లుగా కొనసాగిన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కులమతాలకు అతీతంగా అందరూ ఆలయ నిర్మాణానికి సహాయపడ్డారు. మందిర నిర్మాణానికి స్వర్గీయ ఈశ్వర హరినాథ్ బాబుస్వామి రూపశిల్పి అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నంద్యాల వాస్తవ్యులు దేహారం లక్ష్మీనారాయణశర్మ ఆధ్వర్యంలో ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ముఖద్వారం, స్వామివారి మండపం అద్భుతంగా తీర్చిదిద్దారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి, క్యాంటీన్ సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అడవుల సంరక్షణ.. అందరి బాధ్యత



కళాజాతతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బనగానపల్లె రూరల్: పర్యావరణాన్ని కాపాడడం, అడవులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని నందివర్గం, రామతీర్థం గ్రామాల్లో అడవుల సంరక్షణ, అగ్నిప్రమాదాల నుంచి రక్షణపై శనివారం కళాజాత నిర్వహించారు. జానపద కళాకారులు ప్రతాప్ బృందం గేయాల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వన్య ప్రాణులను ఎలా సంరక్షించుకోవాలి, అగ్నిప్రమాదాలను ఎలా నివారించాలి తదితర విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మీ, ఎఫ్‌బీఓ వెంకట్‌రెడ్డి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే



బుగ్గన అర్జున్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న మహిళలు

డోన్: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగ్గన అర్జున్ అమర్‌నాథ్ రెడ్డి విమర్శించారు. శనివారం మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములుతో కలిసి ప్యాపిలి మండలం పీఆర్ పల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వేసవికి ముందే గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడంతో ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు మహిళలు వాపోయారు. అనంతరం బుగ్గన అర్జున్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి నేతలు అన్ని కార్యక్రమాల్లో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. సామాన్య ప్రజలకు ప్రభుత్వం నుంచి చేకూరుతున్న లబ్ధి శూన్యం అన్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోదొడ్డి కృష్ణమూర్తి, నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, గడ్డం భువనేశ్వర్ రెడ్డి, బోరెడ్డి రాము, బూరుగల శ్యాం రెడ్డి, నరసింహారెడ్డి, ప్రేమ్‌సాగర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాజారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పది విజయానికి పక్కా ప్రణాళిక

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు
- నియోజకవర్గంలో పరీక్షలకు హాజరు కానున్న 3,365 మంది విద్యార్థులు



స్టడీ అవర్స్‌లో విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయిని

అవుకు: విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి కీలకం. వీటి ఫలితాలపైనే వారి భవిత ఆధారపడి ఉంటుంది. దీంతో అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులు ఈ పరీక్షలకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టింది. గత నెలలో మార్గదర్శకాలు జారీ చేసింది. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా, వందశాతం ఉత్తీర్ణతతో పాఠశాలలకు మంచి పేరు తీసుకొచ్చేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉత్తమ మార్కులు సాధించేలా దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల్లో అభ్యసన స్థాయి పెరగడంతోపాటు వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ఈ ప్రణాళిక దోహదపడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి

పదో తరగతి పరీక్షల్లో బనగానపల్లె నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం విద్యాశాఖ జారీ చేసిన టైమ్‌టేబుల్ ప్రకారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో నూతన ఒరవడిని తీసుకొచ్చేందుకు విద్యాశాఖ 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. పాఠశాలల్లో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక గంట పాటు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.

విద్యాశాఖ యాక్షన్ ప్లాన్ ఇలా..

- విద్యార్థులకు పరీక్షలంటే భయం తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి స్లిప్ టెస్ట్‌ల నిర్వహణ.
- ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో విద్యార్థులను గుర్తించి తృతీయ స్థానంలో ఉన్నవారిపై ప్రత్యేక దృష్టి.
- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తగిన సమయం కేటాయింపు.
- రోజూ ఉదయం 8.15 గంటల నుంచి 9.15 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు.
- రోజుకో సబ్జెక్ట్‌చొప్పున వారానికి 7సబ్జెక్ట్‌ల బోధన.
- సమ్మేటివ్-1 , సమ్మేటివ్-2 పరీక్షలు నిర్వహించి విద్యార్థుల నైపుణ్యాన్ని గుర్తించడం.



అవుకు బాలుర ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు
అవుకు	12	530
కొలిమిగుండ్ల	12	575
సంజామల	08	359
కోవెలకుంట్ల	08	748
బనగానపల్లె	14	1153
మొత్తం	54	3365


ప్రణాళిక అమలు చేస్తున్నాం



మా పాఠశాలలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పాఠ్యాంశాలపై ఏదైనా సందేహాలు ఉంటే విద్యార్థులు భయపడకుండా సలహాలు ఇస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, మొదటి స్థానం సాధించడానికి ప్రయత్నిస్తున్నాం.

–ఎస్.శింగయ్య, హెచ్‌ఎం, అవుకు బాలుర ఉన్నత పాఠశాల

సిలబస్ రివిజన్ చేస్తున్నారు



ఉపాధ్యాయులు సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు నిర్వహించి సిలబస్ రివిజన్ చేస్తున్నారు. ఇక్కడ తోటి విద్యార్థులతో పోటీ పడి బాగా చదువుతున్నాను. ప్రత్యేక తరగతుల ద్వారా అన్ని సబ్జెక్టుల్లో ఉన్నతంగా రాణించడానికి మంచి అవకాశంగా ఉంది.

–ఎస్.ఆనంద్, పదో తరగతి విద్యార్థి, అవుకు

బాగా ఉపయోగపడుతోంది



ప్రత్యేక తరగతులు నిర్వహించడం ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. మంచి మార్కులు సాధించడానికి కష్టపడి చదువుతున్నాం.

–వేదమతి, పదో తరగతి విద్యార్థిని, అవుకు

పరీక్ష అంటే భయం వీడింది



ఇది వరకు పరీక్షలంటే కొద్దిగా భయం ఉండేది. అయితే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు పరీక్షలు నిర్వహిస్తుండడంతో పరీక్షలంటే భయం పోయింది. ప్రత్యేక తరగతిలో బాగా చదువుకుంటున్నాం. ఉపాధ్యాయులు ధైర్యం చెబుతున్నారు. పది పరీక్షల్లో పది పాయింట్లు సాధిస్తానన్న నమ్మకం కలిగింది.

–కె.శిరీష, పదో తరగతి విద్యార్థి, మెట్టుపల్లె